
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం : 17 ఆగస్టు 2025



46.670 టీఎంసీలకు సోమశిల

జలాశయంలో శనివారానికి 46.670 టీఎంసీలు ఉన్నాయి. 24.021 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పవర్ టర్నెల్ ద్వారా 1850, ఉత్తర కాలువకు 340, కండలేరుకు 8,100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,275
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,553
నవర (8 గ్రాములు)	రూ.76,424

గరిష్ఠం/కనిష్ఠం
32.5 /29.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం మేఘావృతంగా అక్కడక్కడ చిరు జల్లులు నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం గాలిలో తేమ 64 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

తెలుగు రాష్ట్రాల్లో మనమే వ్యాపారం చేయాలి

- ఏపీ ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్ నాయకులు

ముత్తుకూరు (పొదలకూరు) : రెండు తెలుగు రాష్ట్రాల్లో మనమే వ్యాపారం చేసుకుంటే తద్వారా ప్రభుత్వాలతోపాటు, వ్యాపారులకు ఆదాయం వస్తుందని ఏపీ ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండలం పంటపాళెంలో శనివారం అసోసియేషన్ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వ్యాపారుల వల్ల ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతున్నట్టు అభిప్రాయపడ్డారు. పంటపాళెంలోని పామాయిల్ ఫ్యాక్టరీల నుంచి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వ్యాపారులు బల్క్‌గా 5 వేలు, 10 వేల టన్నుల పామాయిల్‌ను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ధరల్లో తేడాలు వచ్చిన సమయంలో వారే మనకు విక్రయిస్తున్నందున వ్యాపారులు నష్టపోతున్నారని వెల్లడించారు. ఈ అంశంపై తమ అసోసియేషన్ సుదీర్ఘంగా చర్చలు జరిపి ఎలా అధిగమించాలనే ఆలోచనలతో కొన్ని నిర్ణయాలను తీసుకోవడం జరిగిందన్నారు. గత నెల 29న కడపలో వ్యాపారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ నెల 1 నుంచి ఏపీ బ్రోకర్స్ ద్వారా వర్తకులు రీ–సేల్ చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల బిల్స్ ఉంటేనే పామాయిల్ కొనుగోలు చేసే విధంగా వ్యాపారులకు తెలియజేశామన్నారు. లోకల్ ట్రేడ్ సర్వీస్ వల్ల అందరికీ ఉపయోగం ఉంటుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటహరినాథ్, ట్రెజరర్ చక్రపాణి తదితరులు మాట్లాడారు.

‘చలో కరేడు’ పోస్టర్లు తొలగించడం దారుణం

- ఇది ఎమ్మెల్యే, పోలీసుల దుశ్చర్య
- ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోన్న కూటమి ప్రభుత్వం



మూలం రమేష్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఉలవపాడు మండలం కరేడు రైతులకు మద్దతుగా ఈ నెల 18న ‘చలో కరేడు’ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎమ్మెల్యేతో కలిసి పోలీసులు దుర్మార్గపు పాల్పడ్డారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆరోపించారు. శనివారం రాత్రి ఆయన సాక్షితో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకుని ప్రైవేట్ సోలార్ కంపెనీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని ఈ చర్యను నిరసిస్తూ వామపక్షాలు, పలు రైతు సంఘ నాయకులు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ‘చలో కరేడు’ కార్యక్రమ ప్రచార పోస్టర్లను ఆ గ్రామంతోపాటు సమీప ప్రాంతాల్లోనూ గోడలకు అంటించామన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీసులు కరేడులో ఏర్పాటు చేసిన పోస్టర్స్‌ను శనివారం రాత్రి తొలగించారన్నారు. శనివారం రాత్రి ‘చలో కరేడు’ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్న స్థానికుడైన అంకమరావును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. విజయ్‌కుమార్ అనే మరో వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు యత్నించారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నిరసన తెలిపే హక్కులను కాలరాసే దుశ్చర్యలను ప్రభుత్వ పెద్దలు, పోలీసులు మానుకోకపోతే ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు ప్రతిఘటన మరో స్థాయిలో చూడాల్సి వస్తుందని రమేష్ హెచ్చరించారు. పోస్టర్లు తొలగించినంత మాత్రాన ఉద్యమాన్ని అణిచి వేయలేరని, రైతులను, ప్రజలను రెచ్చగొట్టితే ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుందని స్పష్టం చేశారు.

శ్రీకృష్ణుడిగా లక్ష్మీ నరసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో కొలువైన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం రాత్రి భక్తులకు శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామివారి అలంకార మండపంలో శేషవాహనంపై పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ ఉత్సవర్లను కొలువుదీర్చారు. స్వామివారిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోన మాఢ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవిగ్రహాలకు పాలు, తేనే, పెరుగు, చందనం, వివిధ రకాల పండ్ల రసాలతో స్నపన తిరుమంజనం, హోమం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు.

ఫ్రీ తుస్సులే..

బస్సుల్లో షరతులు వర్తిస్తున్నాయి

కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఆర్టీసీ ఫ్రీ బస్సుల్లో షరతులు వర్తిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు అంటూనే మెలికలు పెట్టింది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించకుండా ఆంక్షలు విధించింది. ఆర్టీసీ బస్సుల్లో పెట్టిన నిబంధనలతో డిపో నుంచి డిపో వరకు కూడా ఉచితంగా ప్రయాణించే అవకాశాలు కూడా తక్కువగానే ఉన్నాయి. ప్రధానంగా నెల్లూరు–కావలి, నెల్లూరు–గూడూరు మధ్య నడిచే బస్సులన్నీ ఎక్స్‌ప్రెస్‌లే అయినా నాన్‌స్టాప్ సర్వీస్‌లో ఉచితం లేదంటూ షరతులు అమలు చేస్తోంది. జిల్లాలోని డిపోల నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ రాష్ట్ర పరిధి వరకు కాదు కనీసం జిల్లా పరిధిలోనూ స్త్రీశక్తి పథకం వర్తించదంటూ బోర్డులు పెట్టేసింది. ప్రధానంగా నెల్లూరు నుంచి రాపూరు మీదుగా రాజంపేటకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచితం లేదంటూ నిబంధనలు పెట్టింది.



నెల్లూరు నుంచి వాకాడుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులో స్త్రీ శక్తి పథకం వర్తించదు అంటూ పెట్టిన బోర్డు

- ఎక్స్‌ప్రెస్‌ల్లోనూ ఎక్కలేరు
- నెల్లూరు టు రాజంపేట బస్సులో స్త్రీశక్తి వర్తించదు
- జిల్లా నుంచి వెళ్లే ఇంటర్ స్టేట్ బస్సుల్లోనే ఇదే రూల్
- నాన్‌స్టాప్ సర్వీస్‌ల్లోనూ అంతే

నెల్లూరు సిటీ: ఏడాదికిపైగా ఊరించిన ఉచిత బస్సు పథకం ఉస్సూరుమనిపిస్తోంది. జిల్లాలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు అంటూనే కొర్రీలు, మెలికలు పెట్టి షరతులు విధించింది. కూటమి ప్రభుత్వం ఏ పథకాన్ని అమలు చేయదు. ఒక వేళ చేస్తే మాత్రం ప్రచారం ఆర్భాటంగా ఉంటుంది. ఉపయోగం మాత్రం ఉండదు అనేదానికి స్త్రీశక్తి (ఉచిత బస్సు పథకం) ఉదాహరణగా నిలుస్తోంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం ఉచితం అంటూనే ఆయా రూట్లలో తొలి రోజునే సర్వీసులు కుదించేసింది. ఇక ఒక ఎక్స్‌ప్రెస్‌లో ఉచితం, మరో ఎక్స్‌ప్రెస్‌లో స్త్రీశక్తి పథకం వర్తించదంటూ బోర్డులు పెట్టడం చూసి ప్రయాణికులు నివ్వెరపోతున్నారు. ప్రస్తుతానికి రద్దీ లేకపోవడంతో పరిస్థితి ఏమిటనేదా ఇంకా అర్థం కాలేదు. రెండు.. మూడు రోజులు గడిస్తే కానీ ఎలా ఉంటుందో చెప్పలేమంటూ ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు.

ఘాట్ రూట్ బస్సుల్లో టికెట్ కొనాల్సిందే..

జిల్లా కేంద్రం నెల్లూరు నుంచి రాజంపేట మధ్య ప్రతి రోజు 10 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తున్నాయి. నెల్లూరు డిపో–1 నుంచి 5 బస్సులు, రాజంపేట డిపో నుంచి 5 బస్సులు తిరుగుతున్నాయి. అయితే ఘాట్ రూట్‌లో నడిచే ఈ బస్సు సర్వీసుల్లో స్త్రీశక్తి పథకం వర్తించదంటూ బోర్డులు పెట్టేసింది.

ఇంటర్ స్టేట్ బస్సుల్లోనూ అంతే..

నెల్లూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు డిపోల నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నారు. ఇవి ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సులే అయినా.. వీటిల్లో ఉచిత ప్రయాణం లేదని చెబుతున్నారు. నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే బస్సులు గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ ప్రధాన స్టాపింగ్‌లు ఉన్నాయి. కనీసం నెల్లూరులో ఎక్కి గూడూరులో దిగాలన్నా.. గూడూరులో ఎక్కి నాయుడుపేటలో దిగాలన్నా.. స్త్రీశక్తి పథకం వర్తించదంటూ చెబుతున్నారు. ఈ బస్సుల్లో కనీసం జిల్లా పరిధిలోనూ ప్రయాణించేందుకు అవకాశం లేకపోవడంతో మహిళా ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని డిపోల నుంచి తిరిగే బస్సుల్లోనూ ఇవే నిబంధనలు వర్తించడంతో మహిళల ప్రయాణానికి ఉపయోగపడడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గూడూరు వరకే ఆర్డినరీలు..


నెల్లూరు నుంచి నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి, సూళ్లూరుపేట, తడ వరకు వెళ్లే ప్రయాణికులకు ఆర్డినరీ బస్సులే లేవు. నెల్లూరు నుంచి గూడూరు వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. అక్కడి నుంచి నాయుడుపేట వైపు ఆర్డినరీ బస్సులే లేవు. ఇటు దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ, అటు పెళ్లకూరు, శ్రీకాళహస్తి, తిరుపతికి వెళ్లాలంటే ఉచిత ప్రయాణం దుర్లభమే. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చంటూ చంద్రబాబు అండ్ కూటమి కో చేస్తున్న ఆర్భాటంగా చేసిన ప్రచారానికి వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉంది. ఉచిత బస్సు అంటూనే షరతులు వర్తిస్తాయంటూ ‘కూటమి’ మార్కుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఒరిజినల్ కార్డు లేకపోతే టికెట్ కొనాల్సిందే..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం ఆంక్షలతో మహిళలకు ఉచిత ప్రయాణం లేకుండా కొత్త ఎత్తులు వేస్తోంది. ఉచిత బస్సు ప్రయాణానికి మహిళలు తమ ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులను చూపించాలని తెలిపిన విషయం తెలిసిందే. అయితే ఆయా కార్డులు తప్పనిసరిగా ఒరిజనల్ కార్డు చేత పట్టుకుని రావాలని కండక్టర్లు హెచ్చరిస్తున్నారు. జెరాక్స్‌లు, ఫోన్‌లో కార్డులను చూపిస్తే చెల్లుబాటు కావని అధికారులు తెలుపుతున్నారు.

అంతా అయోమయం

కూటమి ప్రభుత్వం ఈ నెల 15న సాయంత్రం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం శనివారం నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. అయితే ఆంక్షలు మహిళా ప్రయాణికులకు అయోమయం, గందరగోళంగా మారింది. జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి 492 బస్సులను కేటాయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆత్మకూరు డిపో పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి 61 బస్సులు, కందుకూరు డిపో పరిధిలో 60, కావలిలో 90, నెల్లూరు–1 డిపో పరిధిలో 91, నెల్లూరు–2 డిపో పరిధిలో 90, రాపూరు డిపో పరిధిలో 49, ఉదయగిరి డిపో పరిధిలో 51 బస్సులను మహిళల ప్రయాణానికి ఏర్పాటు చేశారు. ఏ బస్సుల్లో ఫ్రీ ఉందో.. ఏ బస్సులో లేదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. శనివారం నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ మహిళలకు చాలా అనుభవాలు ఎదురయ్యాయి. చాలా మంది మహిళలు ఆయా బస్సుల్లోకి ఎక్కాక.. ఈ బస్సులో టికెట్లు తీసుకోవాలంటూ కండక్టర్లు చెప్పడంతో దిగేస్తూ.. కూటమి ప్రభుత్వంపై చిర్రుబుర్రులాడడం కనిపించింది. శనివారం నెల్లూరు నుంచి వాకాడుకు వెళ్లేందుకు వాకాడు డిపోకు చెందిన ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్లాట్‌ఫాం మీదకు వచ్చింది. అందులో ప్రయాణికులు ఎక్కాక కదిలి వెళ్లిపోయింది. వెంటనే అదే రూట్లో నడిచే మరో ఎక్స్‌ప్రెస్ బస్సును ప్లాట్‌ఫాం మీదకు తెచ్చారు. ప్రయాణికులు అందులోకి ఎక్కేందుకు ప్రయత్నించగా ఈ బస్సులో మహిళలు టికెట్లు తీసుకోవాలంటూ కండక్టర్ చెప్పడంతో ప్రయాణికులు ఆశ్చర్యపోయారు. అదేంటి ఇదీ ఎక్స్‌ప్రెస్.. అదీ ఎక్స్‌ప్రెస్సే కదా అని బస్సు సిబ్బందిని అడిగితే మాకు తెలియదంటూ సమాధానం ఇస్తున్నారు.



రాజంపేటకు వెళ్లే బస్సుల్లో ఫ్రీ లేదంటూ నోటీసు



పల్లెవెలుగులో ఫుల్ కావడంతో ఎక్కవద్దంటూ చెబుతున్న కండక్టర్



నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లో స్త్రీ శక్తి పథకం వర్తించదని పెట్టిన బోర్డు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అన్నీ నాన్‌స్టాప్‌లే.. వీటిల్లోనూ ఇదే రూల్

నెల్లూరు– కావలి, నెల్లూరు–గూడూరు మధ్య ఎక్స్‌ప్రెస్ బస్సులను నాన్‌స్టాప్ చేశారు. ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సులే అయినా.. వీటిల్లోనూ ఉచిత ప్రయాణం వర్తించదంటూ ఆంక్షలు పెట్టారు. ఇక నెల్లూరు నుంచి తిరుపతికి కూడా అన్నీ నాన్‌స్టాప్‌లే వీటిల్లోనూ ఎక్కివీలులేకపోవడంతో మహిళలు ఉస్సూరుమంటున్నారు. ఉన్న అరకొర బస్సుల్లో ఎక్స్‌ప్రెస్‌లోనూ ఉచిత ప్రయాణానికి కొర్రీలు, మెలికలు పెడుతోంది.



ఫ్రీ లేదని చెప్పడంతో దిగేస్తున్న మహిళలు

ప్రచారమే తప్ప ప్రయోజనం శూన్యం



మహిళలకు ఉచిత బస్సు అనేది ప్రచారం తప్ప.. ఆచరణ, ప్రయోజనం శూన్యం. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం అయితే ఎటువెళ్లిన పాతిక, ముప్పై కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశమే లేదు. పల్లెవెలుగుల్లోనే ప్రయాణించాలంటే.. డీసీపల్లి నుంచి నెల్లూరుకు రెండు బస్సులు మారి పోవాల్సిందే. రాష్ట్ర పరిధి దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించదని చెప్పడం మహిళలను మోసం చేయడమే. కనీసం ఆ బస్సుల్లో రాష్ట్ర పరిధిలోని ప్రాంతాలకు కూడా వెళ్లకూడదని పేర్కొనడం మరీ విడ్డూరం.

– రెడ్డి శాంతమ్మ, డీసీపల్లి, మర్రిపాడు

ఉచిత బస్సు ప్రయాణం కొందరికే..

ఆత్మకూరురూరల్: కూటమి ఆర్భాటంగా ప్రచారం చేసుకొని ప్రారంభించిన స్త్రీశక్తి ఉచిత బస్సు పథకంపై మహిళల్లో నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణించవచ్చని ఇటీవల ప్రభుత్వం విధి విధానాలు ప్రకటిస్తూ ఆర్భాటంగా చెప్పింది. అనంతపురం నుంచి శ్రీకాకుళం వయా అన్నవరం వరకు మహిళలు ఉచిత బస్సుల్లో వెళ్లి తీర్థయాత్రలు చేసుకోవచ్చని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా మహిళలు గుర్తు చేసుకున్నారు. వాస్తవంలోకి వస్తే అనేక ఆంక్షలు, కొర్రీలతో ప్రయాణానికి అడ్డంకులు సృష్టించిందని మహిళలు ఆరోపిస్తున్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 67 బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. ఆత్మకూరు డిపో నుంచి చెన్నై, బెంగళూరుకు వెళ్లే బస్సుల్లో జిల్లా పరిధిలో కానీ, రాష్ట్ర పరిధిలోని ప్రాంతాలకు ప్రయాణించడానికి స్త్రీశక్తి పథకం వర్తించదంటూ నిబంధనలు విధించారు. ఇక పల్లెవెలుగు బస్సుల్లోనూ కొన్ని కండీషన్లు పెడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

ఫ్రీ టికెట్ .. కొన్ని బస్సుల్లోనే..

ఉదయగిరి: ఉదయగిరి డిపో పరిధిలో ఉన్న 57 బస్సుల్లో 39 సర్వీస్‌ల్లోనే స్త్రీ శక్తి పథకం వర్తిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు అని చెప్పిన చంద్రబాబు అమల్లోకి వచ్చే సరికి కేవలం కొన్ని సర్వీసులకు మాత్రమే వర్తింప చేస్తూ మోసం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయగిరి డిపో నుంచి 5 సర్వీసులు చెన్నైకు వెళ్తున్నా.. వీటిల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడం లేదు. ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సులే అయినా.. కనీసం జిల్లా, రాష్ట్ర పరిధిలోనూ ఉచితంగా ప్రయాణించే వీలు లేదనడం విడ్డూరమని మహిళలు మండి పడుతున్నారు. ఉదయగిరి డిపో నుంచి నెల్లూరుకు ఉదయం 7.30 గంటల తర్వాత 9 గంటల వరకు ఉచితంగా ప్రయాణించేందుకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు సర్వీసులే లేవు. ఈ సమయంలో చెన్నై సర్వీసు ఉన్నప్పటికీ టికెట్ కొని ప్రయాణించాల్సిందే. ఉన్న బస్సులు కుదించి ఉచిత ప్రయాణం అంటే ఎలా అని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి డిపో నుంచి సాయంత్రం 7 గంటల తర్వాత నెల్లూరు వైపు వెళ్లే సర్వీసులు చెన్నైకు వెళ్లేవి కావడంతో టికెట్లు కొని ప్రయాణించాల్సిందే. అదే విధంగా ఉదయగిరి నియోజకవర్గంలోని 90 శాతం పల్లెలకు బస్సులు లేవు. మరి పల్లెల్లో ఉండే మహిళలకు ఉపయోగం ఏమిటో ప్రభుత్వ పెద్దలకే ఎరుక. ఉదయగిరి నుంచి సాయంత్రం 6 గంటల తర్వాత ఒక ఉచిత సర్వీసు కూడా లేదు. మరి ఆ సమయం తర్వాత వెళ్లే మహిళలు తిరిగే బస్సుల్లో టికెట్లు కొని ప్రయాణించాల్సిందే. ఉదయగిరి నుంచి నెల్లూరు, కావలి, బద్వేల్, పామూరు వైపు వెళ్లే ఫ్రీ సర్వీసులు పరిమితంగా ఉండడంతో ఉదయగిరిలోనే బస్సులు నిండే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత స్టేజీల్లో ఎక్కే ప్రయాణికులు నిలబడి ప్రయాణం చేయాల్సిందే. ఉచిత సర్వీసులు పెంచితే ఈ సమస్య ఉండదు.

తమిళ బోట్లను తరిమికొడుదాం

- జువ్వలదిన్నెలో నాలుగు జిల్లాల్లోని 134 మత్స్యకార గ్రామాల కాపుల సమావేశం
- పట్టుబడిన కడలూరు, కారైకల్ బోట్లను గస్తీకి వినియోగించాలని నిర్ణయం



సమావేశంలో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాల మత్స్యకార గ్రామ కాపులు

బిట్రగుంట: రాష్ట్ర సరిహద్దు సముద్ర జలాల్లో మత్స్య సంపదను కొల్లగొడుతూ తీరప్రాంత గ్రామాలకు ఉపాధి లేకుండా చేస్తున్న తమిళనాడు బోట్లను సమష్టిగా అడ్డుకోవాలని నాలుగు జిల్లాల మత్స్యకార గ్రామాల కాపులు ఐక్యంగా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే తమకు పట్టుబడి జువ్వలదిన్నె హార్బర్‌లో ఉన్న కడలూరు, కారైకల్ బోట్లను గస్తీకి వినియోగించాలని నిర్ణయించారు. మత్స్యకార గ్రామకాపుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని మత్స్యకార కాపులు జువ్వలదిన్నెలో శనివారం రెండో విడత సమావేశమయ్యారు. పెద్దబోట్లు, వలలతో వేట సాగిస్తూ స్థానిక మత్స్యకారుల ఉపాధికి గండికొడుతున్న తమిళనాడు బోట్లను అడ్డుకునే విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం, మెరైన్ పోలీస్‌లు ఎవరూ చొరవ తీసుకోవడం లేదని, ఫలితంగా స్థానిక మత్స్యకారులపై దాడులు చేయడం, వలలు ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. వారు మాట్లాడుతూ పదేళ్ల నుంచి తమిళనాడు బోట్లు (పెద్ద బోట్లు) రాష్ట్రంలోని నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని తీరంలో వేట సాగిస్తూ స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా చేస్తున్నాయన్నారు. పెద్ద వలలు, నిషేధిత వలలతో వేట సాగిస్తూ చిన్నచిన్న చేపలను కూడా పట్టుబడి చేస్తుండడంతో పునరుత్పత్తి గణనీయంగా తగ్గిపోయి మత్స్యసంపద లభించడం కష్టంగా మారిందన్నారు. వీరు వేట సాగించే సమయంలో స్థానిక మత్స్యకారుల వలలు, పడవలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. మత్స్య సంపదకు చేటు తెస్తున్న తమిళనాడు బోట్లను అడ్డుకోవాలని పదేపదే అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో 2023లో సుమారు వంద గ్రామాల కాపులతో ఇస్కపల్లిలో సమావేశం నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో జూలై 31న ఇందుకూరుపేట మండలం కృష్ణాపురం సమీపంలో తీరానికి చొచ్చుకు వచ్చి వేట సాగిస్తున్న కడలూరు, కారైకల్ బోట్లను స్థానిక మత్స్యకారులు ప్రాణాలకు తెగించి అడ్డుకున్నారని వివరించారు. ఈ బోట్లను స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె హార్బర్‌కు చేర్చడం జరిగిందన్నారు. పట్టుబడిన ఈ బోట్లనే గస్తీకి వినియోగించి తమిళనాడు బోట్లను పూర్తిగా అడ్డుకోవాలని తాజా సమావేశంలో నిర్ణయించుకున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి, రాజకీయ పార్టీలకు, రాజకీయ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలని లక్ష్యంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

వేమిరెడ్డితో బెడిసిందా!

- రూప్‌కుమార్ ఫ్లెక్సీల్లో వీపీఆర్ ఫొటో లేకపోవడంపై చర్చ

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా పాలిటిక్స్‌లో ప్రధానంగా టీడీపీలో ఒక చర్చ నడుస్తోంది. ఇది ప్రస్తుత తరుణంలో హాట్‌టాపిక్‌గా మారింది. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని తీసుకెళ్లడంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ మంత్రాంగం నడిపించారనే చర్చ జరుగుతోంది. జిల్లాలో మైనింగ్ వ్యవహారంలో కూడా రూప్‌కుమార్ పార్టీ అధిష్టానం వద్ద ఎంపీ వేమిరెడ్డిని ముందు పెట్టి వెనుక నుంచి వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. ఏడాది కాలంగా జిల్లాలో అక్రమ మైనింగ్ వ్యవహారంపై పెద్ద దుమారమే రేగుతోంది. జిల్లాలోని మొత్తం మైన్లను తన గుప్పెట్లో పెట్టుకుని రూప్‌కుమార్ ద్వారా వ్యవహారాన్ని నడిపిస్తున్నారనే విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నట్టు ఉండి.. ఇటీవల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తాను మైనింగ్ వ్యాపారం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రెస్‌మీట్ పెట్టి బహిరంగంగా ప్రకటించారు. వేమిరెడ్డి కోటరీలో కీలక నేతగా ఉన్న రూప్‌కుమార్ కొద్ది రోజులుగా మరో కోటరీతో రాసుకునిపూసుకుని తిరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం రూప్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలకు సంబంధించి ఆయన అభిమానులు నగరంలో ఫ్లెక్సీలను నింపేశారు. అందులో పార్టీ పెద్దలు చంద్రబాబు, లోకేశ్, డీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ఎన్టీఆర్ ఫొటోలు ఉన్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫొటో లేకపోవడంపై టీడీపీలో తీవ్ర చర్చ జరుగుతోంది. తాజాగా రెండు రోజులుగా రూప్‌కుమార్ మంత్రి నారాయణ వెంటనే కార్యక్రమాల్లో పాల్గొంటుండడం కూడా ఈ చర్చకు అద్దం పడుతోంది. వేమిరెడ్డి, రూప్‌కుమార్ మధ్య ఏమన్నా బెడిసిందా ఏమిటి అనే చర్చ సొంత పార్టీలోనే హాట్‌టాపిక్‌గా మారింది.



రూప్‌కుమార్ పుట్టిన రోజు శుభాకాంక్షల ఫ్లెక్సీల్లో కనిపించని వీపీఆర్ ఫొటో

క్లుప్తంగా

తేలుకాటుతో బాలుడి మృతి

కావలి (జలదంకి): తేలుకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కావలి రూరల్ మండలం గౌరవరం ఎస్టీ కాలనీకి చెందిన చౌటూరి చిన్నయ్య పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో గల వాటర్ ప్లాంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆయన రెండో కుమారుడు శ్రీనివాసుడు (11) స్థానికంగా ఉన్న పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ కొంతకాలంగా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఈ క్రమంలో ఇంటి వెనుక ఉన్న తాటి చెటెక్కి పండ్లు కోస్తుండగా, తేలు కుట్టింది. దీంతో జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కావలి రూరల్ ఎస్సై బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న బస్సు

- క్లీనర్ దుర్మరణం





సంతోష్ (ఫైల్)

గూడూరు: లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో క్లీనర్ మృతి చెందిన ఘటన తెట్టు ఫ్లైఓవర్ వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఘటనలో బస్సు క్లీనర్ ఉండ్రరాశి సంతోష్ (27) మృతి చెందారు. మృతుడ్ని కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం పెద ఓగిరాలకు చెందిన వారిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలిచారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై వెంకట్రావు తెలిపారు.

రైల్లోంచి జారిపడి ముగ్గురి దుర్మరణం

జిల్లాలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ప్రమాదాల్లో రైల్లోంచి జారి పడి ముగ్గురు మృత్యువాత పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు, కావలి సమీపంలో జరిగిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మరణించారు.



అర్షద్, పోలయ్య (ఫైల్)

తలుపు వద్ద మాట్లాడుకుంటూ..

నెల్లూరు(క్రైమ్): రైల్లోంచి ప్రమాదవశాత్తూ జారిపడటంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరుకు చెందిన పోలయ్య (24), అర్షద్ (19), వెంకటేష్ స్నేహితులు. ప్రైవేట్ స్కూల్ వ్యాన్ క్లీనర్‌గా పోలయ్య.. మెకానిక్‌గా అర్షద్ పనిచేస్తున్నారు. స్నేహితుడి తమ్ముడి కుమార్తె ఫంక్షన్ నిమిత్తం విజయవాడకు ఈ నెల 14న రైల్లో వీరు బయల్దేరారు. బోగీ తలుపు వద్ద పోలయ్య, అర్షద్ కూర్చొని మాట్లాడుకోసాగారు. ఈ క్రమంలో కొండాయపాలెం గేట్ సమీపంలో వీరి జారిపడ్డారు. కొద్దిసేపటికి వీరు కనిపించకపోవడంతో నెల్లూరులో రైలు దిగి చుట్టుపక్కల వెంకటేష్ గాలించారు. అనంతరం చెన్నూర్లో జరిగిన విషయాన్ని స్నేహితుల కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అందరూ కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రైల్వే పోలీసులకు ఓ మృతదేహం శుక్రవారం లభ్యం కాగా, జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కొండాయపాళెం గేట్ సమీపంలోని చెట్లలో దుర్గంధం వస్తుండటాన్ని రైల్వే సిబ్బంది శనివారం గమనించారు. పరిశీలించగా మృతదేహం కనిపించింది. ఇదే క్రమంలో అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు.. అర్షద్‌గా గుర్తించారు. ఘటన స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అక్కడే ఉన్న మరో మృతదేహాన్ని బాధిత కుటుంబసభ్యులకు చూపించగా అది పోలయ్యదని గుర్తించారు. రైల్వే ఎస్సై హరిచందన దర్యాప్తు చేస్తున్నారు. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి..



కావలి (జలదంకి): రైల్లోంచి జారిపడటంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కావలి రైల్వేస్టేషన్ పరిధిలోని ముసునూరు సమీపంలో దిగువ లైన్లో చోటుచేసుకుంది. కావలి రైల్వే ఎస్సై వెంకట్రావ్ వివరాల మేరకు.. మృతుడు తెలుపు చొక్కా, తెలుపు రంగు కట్ బనియన్, బ్లూ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని కావలి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 94406 27648 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌతు లచ్చన్న జీవితం ఆచరణీయం



నివాళులర్పిస్తున్న జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు



నెల్లూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి తరానికి ఆచరణీయమని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గౌతు లచ్చన్న జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, మత్స్యశాఖ జేడీ శాంతి, బీసీ నేతలు జనార్దన్‌రాజు, జనార్దన్‌గౌడ్, ఉప్పు భాస్కర్, పద్మజాయాదవ్, శ్రీనివాసులు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఎస్పీ కృష్ణకాంత్ నివాళులర్పించారు.

వైఎస్సార్సీపీలో 20 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): టీడీపీని 20 కుటుంబాలు వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీ పదో డివిజన్ నేత వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీరు పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బలోపేతానికి పనిచేయాలని సూచించారు. జగనన్నను మరోసారి సీఎం చేయడమే లక్ష్యంగా వ్యవహరించాలని కోరారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలోల్లో)



పెద్దవి: రూ.40
సన్నవి: రూ.30
పండ్లు: రూ.15

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.123
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.224
స్కిన్‌లెస్ చికెన్:	రూ.250
లేయర్ చికెన్:	రూ.200

ఘనంగా ఏపీజీఈఏ గుర్తింపు దినోత్సవం

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘ గుర్తింపు దినోత్సవాన్ని సంఘ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి, జిల్లా మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వోద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల సాధనకు పాటుపడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు. జిల్లా కార్యదర్శి రామ్ ప్రసాద్, మహిళా విభాగ చైర్‌పర్సన్ సుజాతాబాయి, సచివాలయ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బషీర్, జిల్లా సంయుక్త కార్యదర్శి దినేష్, సిటీ యూనిట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, పెన్షనర్స్ సంఘ కోశాధికారి విశ్వనాథం, శశికుమార్, కోవూరు తాలూకా అధ్యక్షుడు వెంకటేష్, చంద్రకిరణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వేడుకగా కృష్ణాష్టమి





నెల్లూరు(బృందావనం): ఇస్కాన్ సిటీలోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. మందిరంలో కొలువైన రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను విశేషంగా జరిపారు. జగన్నాథ, సుభద్ర, బలరాములు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. కృష్ణ భగవానుడికి ఊంజల్‌సేవను నిర్వహించారు. కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన సావనీర్‌ను మందిరాధ్యక్షుడు శుఖదేవస్వామి ఆవిష్కరించి, భక్తులకు అందజేశారు. కృష్ణ భగవానుడికి అభిషేక మహోత్సవాన్ని నిర్వహించి 108 వంటకాలతో నివేదన చేసి మహాహారతినిచ్చారు.

శ్రీలప్రభుపాద వ్యాసపూజ నేడు

ఇస్కాన్ వ్యవస్థాపకుడు శ్రీలప్రభుపాద వ్యాస పూజను ఆదివారం నిర్వహించనున్నామని శుఖదేవస్వామి తెలిపారు. హారతి, 56 వంటకాలతో నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

- పూజా కార్యక్రమాలకు ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు హాజరయ్యారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారానికి 27.85 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6600 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. సత్యసాయి గంగకు 1800, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): పార్థసారథినగర్‌లోని జెనెక్స్ బీ స్కూల్లో క్యాంపస్ డ్రైవ్‌ను బెంగళూరుకు చెందిన ఐటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్లో శనివారం అభినందించిన అనంతరం చైర్మన్ వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు మాట్లాడారు. ఇప్పటి వరకు అనేక డ్రైవ్‌లను నిర్వహించి 150 మందికిపైగా విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించామని వెల్లడించారు. కంపెనీ హెచ్ఆర్ శ్రీకన్య, పీజీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌తేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్, ప్లేస్‌మెంట్ హెడ్ చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): అలంకార్ సెంటర్‌లో ఇటీవల దారుణ హత్యకు గురైన లైఖ్ కేసులో నిందితులను చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. కేటరింగ్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న కసాయివీధికి చెందిన లైఖ్ (36) వద్ద కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డుకు చెందిన నూరుద్దీన్ అలియాస్ నూర్ పనిచేస్తున్నారు. తన భార్యతో చనువుగా ఉండేందుకు లైఖ్ యత్నించడంతో పాటుగా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడాన్ని నూర్ జీర్ణించుకోలేకపోయారు. లైఖ్‌ను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకొని విషయాన్ని వైఎస్సార్‌నగర్‌కు చెందిన తన స్నేహితుడు ఉస్మాన్ అలియాస్ దావూకు చెప్పారు. నిందితులిద్దరూ కలిసి విక్టోరియా గార్డెన్స్ వద్ద లైఖ్‌ను ఈ నెల 13న హత్య చేసి పరారయ్యారు. మృతుడి అన్న రఫీ ఫిర్యాదు మేరకు హత్య కేసును పోలీసులు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఇన్‌స్పెక్టర్ ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో ఇళ్ల సమీపంలో నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు కత్తులు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.